# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 20-02-2025 సమయం : సాయంకాలం 6 గం. 10 ని. లు

## ముఖ్యాంశాలు

- ❖ పోలవరం బనకచర్ల లింక్ ప్రాజెక్టు ప్రతిపాదనలను కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్‌కు వివరించామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు.
- ❖ రాష్ట్రంలో దివ్యాంగుల ఫించన్ల పరిశీలన ప్రక్రియ పారదర్శకంగా జరుగుతుందని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ వెల్లడించారు.
- ❖ విద్యుత్ ఛార్జీలు పెంచడం లేదని ఎపిఇఆర్సీ ఛైర్మన్ ఠాగూర్ రామసింగ్ స్పష్టం చేశారు.
- ❖ ఎపిపిఎస్సీ గ్రూపు-2 మెయిన్స్ పరీక్షకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తున్నామని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ తెలిపారు.
- ❖ ఎన్డీయే కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలకు కట్టుబడి పని చేస్తోందని ఉపముఖ్యమంత్రి కె.పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు.

==========================

కేంద్ర జల శక్తి మంత్రి సీఆర్ పాటిల్‌తో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ రోజు న్యూఢిల్లీలో సమావేశం అయ్యారు. ఈ సమావేశంలో రాష్ట్రానికి సంబంధించి పలు కీలక అంశాలపై ఫలప్రదమైన చర్చ జరిగిందని సామాజిక మాధ్యమం వేదికగా ముఖ్యమంత్రి వెల్లడించారు. పోలవరం ప్రాజెక్టును యుద్ధప్రాతిపదికన పూర్తి చేయడానికి అవసరమైన సహాయ సహకారాలు అందించాలని కేంద్రమంత్రిని కోరామని పేర్కొన్నారు. పోలవరం బనకచర్ల లింక్ ప్రాజెక్టు ద్వారా 200 టీఎంటీల వరద నీరు గోదావరిలోని పోలవరం నుంచి బనకచర్లకు పంపేందుకు లింక్ కెనాల్ ఏర్పాటుపై చర్చించామని.. ఈ ప్రాజెక్టు పూర్తి అయితే ఆంధ్రప్రదేశ్ కరువు రహితంగా మారడంతో పాటు 80 లక్షల మందికి తాగునీరు అందిస్తుందని మంత్రి సీఆర్ పాటిల్ కు వివరించామని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. అనంతరం కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ తో సమావేశమయ్యాఢ. మిర్చి పంట ధర బహిరంగమార్కెట్‌లో గణనీయంగా తగ్గిపోయిందని, మిర్చి రైతులను వెంటనే ఆదుకోవాలని మంత్రిని కోరారు.

==========================

రాష్ట్రంలో దివ్యాంగుల ఫించన్ల పరిశీలన ప్రక్రియ పారదర్శకంగా జరుగుతున్నదని చిన్న, సూక్ష్మ మధ్యతరహా పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. ఈ రోజు రాష్ట్ర సచివాలయంలో ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ... రాష్ట్రంలో దాదాపు 8 లక్షల దివ్యాంగులకు సామాజిక భద్రతా ఫించన్లు పంపిణీ చేయడం జరుగుతుందని, ఇందులో ఇప్పటి వరకూ 1.20 లక్షల ఫించన్ల వెరిఫికేషన్ పూర్తి అయినట్లు తెలిపారు. అర్హులైన ఏ ఒక్కరికీ ఎటు వంటి అన్యాయం జరుగదన్నారు. ఇప్పటి వరకూ 50 శాతం సర్వే పూర్తయిందని, మార్చి 15 నాటికి ఈ సర్వే పూర్తవుతుందని మంత్రి వివరించారు.

===========================

ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి (ఏపిఈఆర్సి) ఛైర్మన్ ఠాగూర్ రామసింగ్ 2025-26 సంవత్సరానికి సంబంధించిన విద్యుత్ ఛార్జీల టారిఫ్ ను ఈరోజు తిరుపతిలోని ఎస్పీడీసీఎల్ కార్యాలయంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మార్చి 31 లోపు విడుదల చేయాలసిన టారిఫ్ ను ఫిబ్రవరిలోనే విడుదల చేస్తున్నట్లు చెప్పారు. ఏ విభాగంలో కూడా విద్యుత్ ఛార్జీలు పెంచడం లేదని స్పష్టం చేశారు. వ్యవసాయ వినియోగదారులు, ఉద్యానవన నర్సరీలు, రజకులు, ఆక్వాకల్చర్ రైతులు, షెడ్యూల్డ్ కులాలు, తెగల కుటుంబాలకు ఉచిత విద్యుత్ రాయితీలు కొనసాగుతాయని ఆయన పేర్కొంటూ....

(వాయిస్ 26 సెకన్లు)

===========================

ఏపిపిఎస్సి గ్రూపు-2 మెయిన్స్ పరీక్ష ఈనెల 23వ తేదీన జరగనుంది. ఈ నేపథ్యంలో పరీక్షలకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తున్నామని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ చెప్పారు. పరీక్షల నిర్వహణపై రాష్ట్ర సచివాలయంలో ఏపిపిఎస్సి ఛైర్మన్ ఎ.అనురాధతో కలసి ఆయన అధికారులతో ఈరోజు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, పరీక్షల నిర్వహణలో ఎటువంటి అవాంఛనీయ సంఘుటనలకు తావు లేకుండా అన్ని పరీక్షా కేంద్రాల వద్ద బందోబస్తు ఏర్పాట్లను పూర్తి చేయాలని కలెక్టర్లు, ఎస్పీలను ఆదేశించారు. 13 ఉమ్మడి జిల్లా కేంద్రాల్లోని 175 పరీక్షా కేంద్రాల్లో పరీక్షలను నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. పరీక్షల నిర్వహణకు సంబంధించి తీసుకోవాల్సిన చర్యలపై ఇప్పటికే మార్గదర్శకాలను జిల్లా అధికారులకు పంపండం జరిగిందని.. వాటిని పూర్తిగా పాటించాలని స్పష్టం చేశారు. కాగా ఈ పరీక్షలకు 92,250 మంది అభ్యర్థులు హాజరు కానున్నారని చెప్పారు.

===========================

రాష్ట్రంలో ఎన్డీయే కూటమి పార్టీ సమన్వయంతోనే కలిసి పనిచేస్తున్నామని ఉప ముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు. ఢిల్లీ ముఖ్యమంత్రి ప్రమాణస్వీకారానికి హాజరైన ఆయన ఈ సందర్భంగా పాత్రికేయులతో మాట్లాడుతూ... ఎన్డీయే కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలకు కట్టుబడి పని చేస్తోందని తెలిపారు. పర్యాటక, అటవీ శాఖలు తనకు చాలా ఇష్టమైన శాఖలని.. నిబద్ధతతో తన మంత్రిత్వ శాఖ బాధ్యతలు నిర్వహిస్తున్నానని పేర్కొన్నారు. అనారోగ్య కారణాలతో గత కొద్ది రోజుల్లో జరిగిన అధికారిక కార్యక్రమాలకు హాజరుకాలేదని పవన్ కళ్యాణ్ వెల్లడించారు.

విరామం

===========================

ఈ ఎస్ ఐ ఆసుపత్రుల్లో మెరుగైన సౌకర్యాలను అందించేందుకు చర్యలు చేపట్టామని కార్మిక శాఖా మంత్రి వాసంశెట్టి సుభాష్ తెలిపారు. ఈ రోజు అమరావతి సచివాలయంలో పాత్రికేయులతో నిర్వహించిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ... కార్మికులకు ఉచితంగా వైద్య సేవలు అందజేయాలనే లక్ష్యంతోనే ఇ.ఎస్.ఐ. ఆసుపత్రులను ఏర్పాటు చేశామని, అయితే అటువంటి లక్ష్యానికి విఘాతం కల్పించే వారిని ఉపేక్షించబోమని హెచ్చరించారు. రాజమహేంద్రవరం

ఇ.ఎస్.ఐ. ఆసుపత్రిలో విధుల్లో నిర్లక్ష్యం వహిస్తున్న సిబ్బందిని సస్పెండ్ చేయడం జరిగిందని ఆయన తెలిపారు. తిరుపతి ఇ.ఎస్.ఐ. ఆసుపత్రి వైద్యులు అంకిత భావంతో పని చేస్తున్నారని మంత్రి మాట్లాడుతూ…

(వాయిస్ 28 సెకన్లు)

==========================

పార్వతీపురం మన్యం జిల్లాలో “పల్లె పండుగ” కింద మంజూరైన పనులన్నీ నూరు శాతం పూర్తి కావాలని కలెక్టర్ ఎ. శ్యామ్ ప్రసాద్ అధికారులను ఆదేశించారు. ఈరోజు కలెక్టర్ కార్యాలయంలో పల్లె పండుగ పనులపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ… జాతీయ ఉపాధి హామీ పథకంలో భాగంగా పల్లె పండుగ కింద చేపట్టిన పనులన్నీ ఈ నెలాఖరు నాటికి పూర్తి చేయాలని ఆదేశించారు. అనుమతి మంజూరు చేసినప్పటికీ పనులు ప్రారంభించని గుత్తేదారులను రద్దు చేసి, వేరే గుత్తేదారునితో పనులు చేపట్టాలని కలెక్టర్ వివరించారు. ఈ నెలాఖరిలోగా పనులు పూర్తి చేయాలని అధికారులకు స్పష్టం చేశారు.

==========================

తిరుపతి పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో పిఐబి ఆధ్వర్యంలో పాత్రికేయులకు ఒకరోజు కార్యశాల నిర్వహించారు. ఈ సందర్భంగా పిఐబి అడిషనల్ డైరెక్టర్ జనరల్ రాజేంద్రచౌదరి జర్నలిస్టులకు, విశ్వవిద్యాలయంలోని జర్నలిజం విద్యార్థులకు పలు సూచనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ… జర్నలిజంలో చేరేందుకు యువత ఎక్కువగా శ్రద్ధ పెట్టటం శుభపరిణామమన్నారు. సమాజంలో జరుగుతున్న పరిణామాలను ఎప్పటికప్పుడు ప్రసారం చేసే సామాజిక మాధ్యమాల ప్రభావం ప్రస్తుతం ఎక్కువగా ఉందన్నారు. పిఐబి ద్వారా రాష్ట్రంలో జర్నలిస్టులకు మరిన్ని వర్క్ షాపులు నిర్వహిస్తున్నామని ఆయన పేర్కొంటూ…

(వాయిస్ 30 సెకన్లు)

==========================

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సంకల్పం “వికసిత్ భారత్-2047”, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ధ్యేయం స్వర్ణాంధ్ర లక్ష్యంగా పని చేస్తున్నామని ఇరవై సూత్రాల కార్యక్రమాల అమలు ఛైర్మన్ లంకా దినకర్ పేర్కొన్నారు. ఈ రోజు చిత్తూరు జిల్లా సచివాలయంలో ఇరవై సూత్రాల కార్యక్రమాల అమలు ఛైర్మన్ జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, ఇతర ప్రాజెక్టు అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ… కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న వివిధ పథకాలపై ఇదివరకే 13 జిల్లాలలో సమీక్షా సమావేశాలు జరిపామని, చిత్తూరు జిల్లాలో 14వ సమీక్షా సమావేశం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ పథకాలపై లబ్ధిదారులకు అవగాహన కల్పించడమే లక్ష్యంగా అడుగులు వేస్తున్నామనారు.

==========================

ప్రకృతి సేద్యాన్ని ప్రోత్సహించేలా మరింత దృష్టి పెట్టాలని ప్రకాశం జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా అధికారులకు సూచించారు. రానున్న ఖరీఫ్ సీజనుకు ప్రకృతి వ్యవసాయంపై కార్యాచరణ ప్రణాళిక రూపొందించే అంశంపై ఈ రోజు ఒంగోలు కలెక్టర్ కార్యాలయంలో వ్యవసాయం, ఉద్యానవనం, ప్రకృతి సేద్యం, డిఆర్డిఏ అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ… మారిన జీవన శైలి వల్ల ఆరోగ్యం దెబ్బ తింటున్నదని, ఈ పరిస్థితిలో మార్పు తీసుకురావడానికి ఆహారమే ఔషధంగా పనిచేయాల్సి ఉంటుందన్నారు. ప్రకృతి సేద్యం ద్వారా వచ్చిన ఉత్పత్తులే దీనికి ప్రత్యామ్నాయమన్నారు.

==========================
==========================